సాక్షి
ఆదిలాబాద్
మంగళవారం । 21 । మే । 2024



రైతులు.. బహుపరాక్

వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. 9లో▸



నష్టాల్లో వేరుశనగ రైతులు

వేరుశనగ సాగు చేసిన రైతులకు కష్టాలు తప్పడం లేదు. చీడపీడల కారణంగా దిగుబడి తగ్గి పెట్టుబడి కూడా అందని పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
41.0/29.0

వాతావరణం

చాలా వరకు ఎండగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. పలుచోట్ల జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రారంభమైన టెట్



హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్‌: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్‌) సోమవారం నుంచి ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌ ద్వారా విడతల వారీగా జూన్‌ 2 వరకు నిర్వహించనున్నారు. జిల్లాలో మొత్తం 1,591 మంది పరీక్షలు రాయనున్నారు. ఇందులో భాగంగా తొలిరోజు ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.40 గంటల వరకు పరీక్షలు కొనసాగాయి. ఉదయం పరీక్షకు 57 మందికి గాను 32 మంది, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 100 మందికి గాను 81 మంది హాజరైనట్లు చీఫ్‌ సూపరింటెండెంట్‌ పున్నారావు తెలిపారు.

పనిభారం తగ్గించాలి



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్‌ఎంలు

ఆదిలాబాద్‌టౌన్‌: పనిభారం తగ్గించాలని సెకండ్‌ ఏఎన్‌ఎంలు వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్‌ నరేందర్‌ రాథోడ్‌ను కోరారు. సోమవారం సీఐటీయూ నాయకులతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపదికన ఏఎన్‌ఎంలను నియమించాలని డిమాండ్‌ చేశారు. అర్బన్‌ హెల్త్‌ సెంటర్లలో 12 మంది పనిచేస్తున్నారని, ఒక్కో ఏఎన్‌ఎంకు 15 వేల నుంచి 20వేల వరకు జనాభా ఉందని తెలిపారు. పీపీ యూనిట్‌ రద్దుతో తమపై అదనపు భారం పడుతుందన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్‌, ఆశన్న, నవీన్‌, ఏఎన్‌ఎంలు తులసి, పుష్పలత, తదితరులున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



గురువులతో పూర్వవిద్యార్థులు

జైనథ్‌: మండలంలోని కూర జెడ్పీ ఉన్నత పాఠశాల 2006–07 బ్యాచ్‌ ఎస్సెస్సీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం సందడిగా సాగింది. చిన్ననాటి మిత్రులంతా మళ్లీ పాఠశాలకు చేరుకున్నారు. ఆత్మీయ పలకరింపుల అనంతరం మధుర స్మృతులను స్మరించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

జొన్న కొనుగోళ్లకు తాత్కాలిక బ్రేక్‌

ఆదిలాబాద్‌టౌన్‌: జిల్లాలోని ప్రాథమిక సహకార సంఘాల ద్వారా చేపడుతున్న జొన్న కొనుగోళ్లను ఈనెల 22 నుంచి 25 వరకు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు మార్క్‌ఫెడ్‌ మేనేజర్‌ ప్రవీణ్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొనుగోలు చేపట్టడం లేదని పేర్కొన్నారు. 28 నుంచి కొనుగోళ్లు పునఃప్రారంభిస్తామని, విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

'రోహిణి' ఎన్నికల కోఆర్డినేటర్‌గా శ్రవణ్‌

కైలాస్‌నగర్‌: ఢిల్లీ నార్త్‌ పార్లమెంట్‌ పరిధిలోని రోహిణి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల కోఆర్డినేటర్‌గా ఆదిలాబాద్‌ జిల్లాకు చెందిన శ్రవణ్‌ నాయక్‌ను నియమించారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీపక్‌ బాబరియా ఉత్తర్వులు జారీ చేశారు.

సిండికేట్‌ దిశగా..

- జిల్లా కేంద్రంలో మద్యం వ్యాపారుల అడుగులు
- రొటేషన్‌ పద్ధతి తెరపైకి తెచ్చేలా లాబీయింగ్‌
- ప్రస్తుతం 'బెల్టు'కు ఒకే ధరకు సరుకు సరఫరా
- 'స్థానిక' ఎన్నికల తర్వాత పూర్తిస్థాయిలో చేపట్టేలా ఒప్పందం



సాక్షి,ఆదిలాబాద్‌: జిల్లాకేంద్రంలో మద్యం సిండికేట్‌ దిశగా అడుగులు పడుతున్నాయి. వ్యాపారుల మధ్య రాజీ కుదిరి రహస్య ఒప్పందం సైతం జరిగినట్లు సమాచారం. బెల్టు షాపులకు సరుకు పంపిణీ విషయంలో ఒకే ధర ఉండాలని నిర్ణయించారు. పార్లమెంట్‌ ఎన్నికల ముందు నుంచే ఇది అమల్లోకి తెచ్చినట్లు తెలుస్తోంది. అంతకుముందు బెల్టు దుకాణాలకు సరుకు పంపిణీలో వ్యాపారుల మధ్య పోటాపోటీ కనిపించింది. లిక్కర్‌ బాక్స్‌లపై డిస్కౌంట్‌ ఎక్కువగా ఇచ్చారు. వారి మధ్య విభేదాలు బెల్టు నిర్వాహకులకు కలిసి వచ్చింది. అయితే ఇది మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. ఇప్పుడు వ్యాపారులు ఒక అవగాహనకు వచ్చారు. అందరూ ఒకే ధరకు సరఫరా చేస్తుండడంతో ఇన్నాళ్లు ప్రయోజనం పొందిన 'బెల్టు' నిర్వాహకులకు అదనపు కమీషన్‌ చేజారిపోయింది.

రొటేషన్‌ పద్ధతికి ఎన్నికల కోడే అడ్డంకి..

జిల్లాకేంద్రంలో 10 వైన్స్‌లు ఉన్నాయి. కొత్త మద్యం పాలసీ విధానం గతేడాది డిసెంబర్‌లో మొదలైంది. అంతకుముందు పాత మద్యం పాలసీలో వ్యాపారులంతా సిండికేట్‌గా ఉండి చక్రం తిప్పేవారు. అందులో భాగంగా ఈపది వైన్స్‌ల నుంచి పట్టణంలోని వందకు పైగా బెల్టు షాపులకు రొటేషన్‌ పద్ధతిలో లిక్కర్‌ సరఫరా చేసేవారు. అంటే పది వైన్స్‌లు ఉంటే.. ప్రతినెలా మూడు వైన్స్‌ల నుంచి అన్ని బెల్టు షాపులకు మాల్‌ పంపిణీ జరిగేది. ఆ షాపులే ఆ నెలలో రూ.75లక్షల చొప్పున సరుకును వాటికి విక్రయించాలి. అలా ప్రతినెలా రూ.2.25 కోట్ల ఆదాయం కేవలం బెల్టు షాపులపైనే సమకూరేది. ఆ తర్వాతి నెలలో రొటేషన్‌ పద్ధతిలో మరో మూడు వైన్స్‌ల నుంచి లిక్కర్‌ సరఫరా జరిగేది. ఇలా వచ్చిన లాభాలను సిండికేట్‌ పద్ధతిలో అన్ని వైన్స్‌ల యాజమాన్యాలు సమానంగా పంచుకునేవి. అయితే కొత్త మద్యం పాలసీ మొదలైన తర్వాత కొన్ని వైన్స్‌లు కొత్తవారికి రావడం, పాత వారికి అనుకున్న మేర దక్కకపోవడంతో మొదట వారి మధ్య రాజీ కుదరలేదు. దీంతో ఇటు వైన్స్‌ల నుంచి అటు బార్‌ల నుంచి కూడా పట్టణంలోని బెల్టు షాపులకు ఎవరుపడితే వారు సరుకు అమ్ముకునే పరిస్థితి ఉత్పన్నమైంది. ఈ క్రమంలో అదనపు కమీషన్‌తో బెల్టు షాపు నిర్వాహకులను ఈవైన్స్‌, బార్‌ల యాజమాన్యాలు ఆకర్షించాయి. ఈ వ్యవహారమంతా మార్చి వరకు సాగింది. తర్వాత వ్యాపారస్తుల మధ్య రాజీ కుదరడంతో వారికి అదనపు కమీషన్‌ ఆవిరైపోయింది. అయితే ప్రస్తుతం ఎన్నికల కోడ్‌ అమలులో ఉండడంతో రొటేషన్‌ పద్ధతిని మద్యం వ్యాపారులు ఇంకా మొదలుపెట్టలేదు. అయితే అంతర్గతంగా వీరి మధ్య ఒప్పందం జరిగినట్లు తెలుస్తోంది. ఎవరి షాపు నుంచి వారు బెల్టు షాపులకు సరుకును ఒకే ధరకు అమ్మే విధంగా ఒప్పందం చేసుకున్నారు. ప్రస్తుతం పార్లమెంట్‌ ఎన్నికల కోడ్‌ అమలులో ఉంది. ఆ తర్వాత పంచాయతీ ఎన్నికల కోడ్‌ వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అన్ని ఎన్నికలు పూర్తయిన తర్వాత పూర్తిస్థాయిలో సిండికేట్‌గా మారి మళ్లీ రొటేషన్‌ పద్ధతిని తెరపైకి తెచ్చేందుకు ప్రయత్నాలు నడుస్తున్నాయి.

అదే జరిగితే..

జిల్లా కేంద్రంలోని ఆయా కాలనీల్లో బెల్టు షాపులను ఏర్పాటు చేసి మద్యం విక్రయించడం వంటి అక్రమ వ్యాపారం ద్వారా ఆదాయం సంపాదించే మార్గానికి అలవాటు పడ్డారు. ఆదాయంపైనే దృష్టి సారించే ఆబ్కారీశాఖ వీటిని నియంత్రించలేక పోతుందనేది జగమెరిగిన సత్యమే. బెల్టు షాపుల్లో చీప్‌ లిక్కర్‌ విక్రయాలు అధికంగా ఉంటాయి. దానికి పైబడి ఓసీ, ఐబీ, ఎంసీ వంటి లిక్కర్ల విక్రయాలకు కూడా జరుగుతాయి. బీర్ల అమ్మకాలు కూడా చేస్తారు. వైన్స్‌ల నుంచి ఈ సరుకును తీసుకొచ్చి కాలనీల్లో విక్రయిస్తారు. ఇదిలా ఉంటే మళ్లీ రొటేషన్‌ విధానాన్ని మద్యం వ్యాపారులు మొదలుపెడితే ఏం జరుగుతుందంటే.. మద్యం వ్యాపారులు బెల్టు షాపులకు సరుకు ధరను పెంచి విక్రయిస్తారు. వారు కాలనీల్లో మరో ఐదు, పది రూపాయలు పెంచి ఎమ్మార్పీ కంటే అదనంగా అమ్ముతారు. ఇలా మద్యం తాగే వాడి జేబుకు చిల్లు పడుతుంది. ఈ రొటేషన్‌ పద్ధతిలో అమ్మకం ద్వారా అత్యధికంగా సిండికేట్‌ లాభపడే అవకాశాలు ఉంటాయి. మధ్యలో బెల్టు షాపు నిర్వాహకులకు కొంత ఆదాయం సమకూరుతుంది.

ఎక్సైజ్‌ నిఘా ఏది?

ఆదిలాబాద్‌ పట్టణంలో ఒకవైపు మద్యం వ్యా పారులు సిండికేట్‌ వైపు అడుగులు వేస్తుండటం, ప్రస్తుతం ఎమ్మార్పీకే విక్రయాలు జరుగుతున్నప్పటికీ ముందు రేటు పెంచి బెల్టు షాపులకు సరుకు పంపిణీ చేసే ఆలోచనలు చేస్తుండగా, ఎక్సైజ్‌ అధికారులు దీన్ని నియంత్రిస్తారా.. లేదా అనేది చూడాల్సిందే. ఎన్నికలకు ముందు ఆబ్కారీ శాఖలో బదిలీలు జరిగాయి. సీఐ, ఎస్సై వంటి అధికారులు అంతా కొత్తవారు వచ్చారు. ఈ నేపథ్యంలో ఇక్కడి మద్యం వ్యాపారుల వ్యవహార శైలిపై ఇంకా ఒక అవగాహన రాలేదన్న ప్రచారం సాగుతుంది. దీనిద్వారా లిక్కర్‌ వ్యాపారులు ఆడిందే ఆటా పాడిందే పాట అన్నట్టుగా వ్యవహారం సాగుతుందని చెప్పుకుంటున్నారు. మళ్లీ సిండికేట్‌ రాటుదేలకుండా ఎక్సైజ్‌ అధికారులు చర్యలు తీసుకోవాలన్న అభిప్రాయం మద్యం ప్రియుల నుంచి వ్యక్తమవుతుంది.

పత్తి రైతుల ఆందోళన



సీడ్స్‌ షాపు ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

- డిమాండ్‌ రకం విత్తనాల కోసం లొల్లి

ఆదిలాబాద్‌టౌన్‌: డిమాండ్‌ రకం పత్తి విత్తనాల కోసం అన్నదాతలు ఆందోళనకు దిగారు. వానాకాలం సీజన్‌ దగ్గర పడడంతో విత్తనాల కోసం రైతులు జిల్లాకేంద్రానికి భారీగా చేరుకున్నారు. రెండు రోజుల క్రితం విత్తనాల కోసం వచ్చిన రైతులకు వ్యాపారులు సోమవారం రావాలని చెప్పడంతో అధిక సంఖ్యలో తరలివచ్చారు. గాంధీచౌక్‌,అంబేద్కర్‌చౌక్‌లోని విత్తన దుకాణాల వద్దకు చేరుకున్నారు. అయితే తమకు కావాల్సిన విత్తనా లు ఇవ్వడం లేదని ఆందోళనకు దిగారు. సీడ్స్‌ డీలర్లతో వాగ్వాదానికి దిగారు. స్టాక్‌ను పక్కదారి పట్టించి బ్లాక్‌లో అధిక ధరకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. అధికారులు వారికి వత్తాసు పలకడంతో తాము ఇబ్బందులకు గురవుతున్నామని పేర్కొన్నారు. డీలర్లు నచ్చజెప్పినా వినకుండా ఆందోళన కొనసాగించారు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్‌ అర్బన్‌ ఏవో రమేశ్‌ అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. డిమాండ్‌ రకం విత్తనాలు తెప్పించేలా ప్రతిపాదనలు పంపామన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నాలుగు రోజుల్లో పూర్తిస్థాయిలో విత్తనాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

పాలన వ్యవహారాలపై దృష్టి సారించాలి

- మున్సిపల్‌ కమిషనర్‌ ఖమర్‌ అహ్మద్‌



పారిశుధ్య సిబ్బందితో సమీక్షిస్తున్న కమిషనర్‌

కైలాస్‌నగర్‌: ఎన్నికల ప్రక్రియ ముగిసినందున అధికారులు, సిబ్బంది తమ రెగ్యులర్‌ పాలన వ్యవహారాలపై దృష్టి సారించాలని మున్సిపల్‌ కమిషనర్‌ ఎండీ.ఖమర్‌ అహ్మద్‌ అన్నారు. తన కార్యాలయ చాంబర్‌లో మున్సిపల్‌ పరిధిలోని పారిశుధ్య, ఇంజినీరింగ్‌, టౌన్‌ ప్లానింగ్‌,మెప్మా అధికారులు, సిబ్బందితో సోమవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం సమీపిస్తున్నందున లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వర్షపునీరు కాలనీల్లోకి వెళ్లకుండా ప్రధాన డ్రెయినేజీల్లోని పూడికను తొలగించాలని సూచించారు. అలాగే నీటి ఎద్దడికి సంబంధించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అవసరమైన ప్రాంతాలకు వేసవి ముగిసేదాకా ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని సూచించారు. అలాగే మున్సిపల్‌ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పది వేల మంది విద్యార్థులున్నారని, వారికి అవసరమైన వస్త్రం డీఈవో కార్యాలయానికి చేరిందన్నారు. జూన్‌ 10వ తేదీలోపు విద్యార్థులకు ఒక్క జతనైనా అందించేలా చూడాలని మెప్మా సిబ్బందికి సూచించారు. అలాగే అక్రమ నిర్మాణాలు, లేఅవుట్‌లపై దృష్టి సారించి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలని టౌన్‌ప్లానింగ్‌ సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ అధికారి జాదవ్‌ కృష్ణ, టీపీవో అనురాధ, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ నరేందర్‌, మెప్మా టీఎంసీ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'బీసీ వాటా' తేల్చండి

- కుల గణన చేసి రిజర్వేషన్లు పెంచండి
- ఆ తర్వాతే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలంటున్న బీసీ సంఘాలు
- ఇప్పటికే ముగిసిన సర్పంచుల పదవీకాలం
- జూన్‌ 30తో ముగియనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీల టర్మ్‌

బోథ్‌: కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లు పెంచిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఇప్పటికే సర్పంచుల పదవీ కాలం ముగిసింది. జెడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం జూన్‌ 30తో ముగియనుంది. మరోవైపు అసెంబ్లీ, పార్లమెంట్‌ ఎన్నికలు ముగియడంతో ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం కసరత్తు ప్రారంభించింది. ఈ ఎన్నికల్లో పాత రిజర్వేషన్లు కొనసాగిస్తారా..? లేక కొత్త రిజర్వేషన్లు తెస్తారో.. ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు స్పష్టత లేదు. అయితే బీసీ రిజర్వేషన్లు కచ్చితంగా పెంచాలని ఆయా సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేస్తున్నాయి. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల్లో 22.8 శాతం మాత్రమే రిజర్వేషన్లు కల్పించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్‌ ఉండగా, బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం దానిని తగ్గించింది. 50శాతం రిజర్వేషన్లు మించరాదన్న సుప్రీంకోర్టు ఆదేశాలతో ఆర్డినెన్స్‌ ద్వారా బీసీ రిజర్వేషన్లను 22.8 శాతానికి తగ్గించారు. జనాభాలో బీసీలే ఎక్కువగా ఉన్నా, రిజర్వేషన్లు మాత్రం తక్కువగా ఇవ్వడంపై ఆయా సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

జనాభా ప్రకారం రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్‌ హామీ..

అసెంబ్లీ, పార్లమెంట్‌ ఎన్నికల ప్రచారంలో భాగంగా కులగణన చేసి జనాభా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేస్తామని కాంగ్రెస్‌ నేతలు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఆ పార్టీ అధికారంలో ఉంది. ఇచ్చిన హామీ మేరకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాల్సిన బాధ్యత కాంగ్రెస్‌పై ఉందని బీసీ సంఘాల నేతలు పేర్కొంటున్నారు. బీహార్‌తో పాటు పలు రాష్ట్రాల్లో బీసీలకు దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలువుతున్నాయిని, తెలంగాణలోనూ అమలు చేయాలని వారు కోరుతున్నారు.

42 శాతం పెంచాలని డిమాండ్‌..

కుల గణన చేపట్టి బీసీల రిజర్వేషన్లు 42 శాతంకు పెంచాలని ఆయా సంఘాల నేతలు కోరుతున్నారు. ఈ మేరకు రాజ్యసభ ఎంపీ ఆర్‌.కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్‌ గౌడ్‌లు ఇప్పటికే ప్రభుత్వానికి విన్నవించారు. కాగా, కుల గణన నిర్వహిస్తే కనీసం రెండు నుంచి మూడు నెలలు సమయం పట్టే అవకాశం ఉంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

- జిల్లాలో మొత్తం 467 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో బీసీలకు కేవలం 47 పంచాయతీల్లోనే రిజర్వేషన్‌ దక్కింది. ఎస్టీలకు 322(ఏజెన్సీ ప్రాంతాలను కలుపుకుని), ఎస్సీలకు 25 పంచాయతీల్లో రిజర్వేషన్లు కేటాయించారు. అన్‌ రిజర్వ్‌డ్‌గా 103 పంచాయతీలు ఉన్నాయి.
- ఇక జెడ్పీటీసీలలో ఎస్సీ–1,ఎస్టీ– 7, బీసీ–0, జనరల్‌– 9. ఇక్కడ జెడ్పీటీసీ రిజర్వేషన్లలో ఎస్సీ, ఎస్టీలకు 8 శాతం రిజర్వేషన్లు కేటాయించడంతో 50 శాతం కేటాయింపు పూర్తియింది. దీంతో బీసీలకు రిజర్వేషన్లు దక్కలేదు.
- జిల్లాలో నాలుగు ఏజెన్సీ మండలాలు ఉండడంతో మిగిలిన 13 మండలాల్లో ఎంపీపీలకు ఎస్సీ –1, ఎస్టీ–7, బీసీ–2 కేటాయించగా, జనరల్‌–7 స్థానాలను కేటాయించారు.

బీసీల వాటా తేల్చాల్సిందే..



రిజర్వేషన్లలో బీసీల వాటా తేల్చాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి. కుల గణన చేపట్టి జనాభా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలి. ప్రస్తుతం అమలవుతున్న 22.8 శాతం రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలి. గత ఎన్నికల్లో బీసీలు తీవ్రంగా నష్టపోయారు.

– కలాల శ్రీనివాస్‌,
బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

పుస్తకాలొస్తున్నాయ్‌..

- జిల్లాకు 65 శాతంపైగా సరఫరా
- విడుదల కాని ట్రాన్స్‌పోర్టు చార్జీలు
- బడులకు చేర్చడంపై సందిగ్ధం

జిల్లాలో మొత్తం పాఠశాలలు: 1439

జిల్లాకు రావాల్సిన పాఠ్య పుస్తకాలు: 4,99,100

ఇప్పటివరకు చేరుకున్నవి : 3,16,549

ఇంకా రావాల్సినవి : 1,82,551

జిల్లాకు వచ్చిన నోట్‌బుక్‌లు: 3,20,228



జిల్లా కేంద్రంలోని ఓ గోదాములో భద్రపర్చిన పాఠ్య పుస్తకాలు

ఆదిలాబాద్‌టౌన్‌: సర్కారు బడులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. ఇప్పటికే పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా మౌలిక వసతులు కల్పిస్తుంది. అలాగే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లు సైతం బడి తెరిచిన రోజునే ఇవ్వాలని నిర్ణయించింది. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని పాఠ్యపుస్తకాల ప్రింటింగ్‌ ప్రెస్‌ నుంచి జిల్లాకు సరఫరా చేస్తుంది. ఇప్పటివరకు 65 శాతంపైగా జిల్లాకు చేరుకున్నాయి. జిల్లా కేంద్రంలో మూడు గోదాములు ఏర్పాటు చేసి వాటిని భద్రపరుస్తున్నారు. రెండు మూడు రోజుల్లో వాటిని మండల పాయింట్లకు చేర్చేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. అయితే వీటిని ట్రాన్స్‌పోర్టు చేసేందుకు నిధులు విడుదల కాకపోవడంతో అయోమయంలో ఉన్నారు. గతేడాది ట్రాన్స్‌పోర్టుకు సంబంధించి ఇంకా కొన్ని డబ్బులు బకాయి ఉన్నాయి. చాలా మంది ఎంఈవోలు ట్రాన్స్‌పోర్టు చార్జీలను వెచ్చించి స్కూళ్లకు పుస్తకాలను సరఫరా చేశారు. గతంలో కాంట్రాక్టర్లకు సంబంధించి కొన్ని బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. దీంతో వారు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఈసారి ఇంకా దీనిపై అధికారులు నిర్ణయించలేదు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో ప్రైవేట్‌ మినహా అన్ని సర్కారు పాఠశాలల యాజమాన్యాలకు పాఠ్య పుస్తకాలు, నోట్‌ పుస్తకాలను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుంది. జిల్లాకు 65 శాతం పైగా చేరుకున్న పాఠ్య పుస్తకాలను జిల్లా కేంద్రంలోని ఆర్‌వీఎం గోదాం, మార్కెట్‌ యార్డు, పాలశీతలీకరణ కేంద్రాల్లో భద్రపర్చారు. ఇంకా 1లక్ష 82వేల పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉంది. మరో 20 రోజుల గడువు ఉంది. అయితే వాటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం నుంచి ట్రాన్స్‌పోర్టు నిధులు విడుదల కాకపోవడంతో మండల పాయింట్లకు, పాఠశాలలకు చేర్చే విషయంలో సందిగ్ధత నెలకొంది. రవాణా చార్జీలను అధికారులు భరించాలనే విషయం తేలాల్సి ఉంది. గతేడాది ఇద్దరు ఎంఈవోలు మినహా మిగతా వారంతా జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రాలకు, పాఠశాలలకు పుస్తకాలను సరఫరా చేయించారు. రూ.3లక్షల 50వేల వరకు ట్రాన్స్‌పోర్టు చార్జీలు కాగా, ప్రభుత్వంనుంచి రూ.2లక్షల వరకు వచ్చాయని, మిగతా రూ.1లక్ష 50వేలు రావాల్సి ఉన్నట్లు చెబుతున్నారు. గతంలో కాంట్రాక్టర్లు ఆయా మండల పాయింట్లకు పుస్తకాలను సరఫరా చేయగా ఆ బిల్లులు సైతం పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. దీంతో కాంట్రాక్టర్లు ఎవరు కూడా ఈసారి ముందుకు రావడం లేదని తెలుస్తోంది. అయితే ఈ పంపిణీ విషయంలో కొంత జాప్యం జరిగే అవకాశాలు ఉన్నట్లు కనిపిస్తుంది.

అధికారుల ఆదేశాల మేరకు చర్యలు

జిల్లాకు 4లక్షల 99వేల పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉండగా, ఇప్పటివరకు 3లక్షల 16వేల పాఠ్య పుస్తకాలు వచ్చాయి. మిగతావి త్వరలోనే రానున్నాయి. ప్రస్తుతం కేజీబీవీలకు సరఫరా చేస్తున్నాం. ట్రాన్స్‌పోర్టుకు సంబంధించి ఇంకా నిధులు విడుదల కాలేదు. అధికారుల ఆదేశాల మేరకు సరఫరా చేసే విధంగా చర్యలు చేపడతాం.

– సత్యనారాయణ,
పాఠ్యపుస్తకాల మేనేజర్‌, ఆదిలాబాద్‌

చేరుకున్న పార్ట్‌–1 పుస్తకాలు

ప్రస్తుతం పాఠ్య పుస్తకాల్లో ఓ వైపు తెలుగు, మరోవైపు ఇంగ్లిష్‌ పాఠ్యాంశాలను ముద్రించారు. ఆంగ్ల మాధ్యమం అమలు చేయడంతో పార్ట్‌–1, పార్ట్‌–2గా విభజించి అందిస్తున్నారు. ప్రస్తుతం పార్ట్‌–1 పుస్తకాలు జిల్లాకు చేరుకోగా, మిగతావి ఆగస్టు, సెప్టెంబర్‌ వరకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వీటిని విభజించడం ద్వారా పుస్తకాల బరువు కూడా తగ్గింది. అయితే గతేడాది నుంచి విద్యార్థులకు ఉచితంగా నోట్‌ పుస్తకాలు కూడా పంపిణీ చేస్తున్నారు. 6, 7 తరగతుల విద్యార్థులకు 6 నోట్‌బుక్‌లు, 8వ తరగతి విద్యార్థులకు 7, అలాగే 9,10వ తరగతి విద్యార్థులకు 14 నోట్‌ బుక్‌లు ఇస్తున్నారు.

గడువులోగా చేరేనా..

ప్రభుత్వం విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తుగానే పుస్తకాలు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రింటింగ్‌ ప్రెస్‌ల నుంచి జిల్లాకేంద్రాలకు సరఫరా చేసింది. అయితే ఇక్కడి నుంచి ఎంఆర్‌సీ పాయింట్ల కు, అక్కడినుంచి స్కూళ్ల కు సరఫరా చేయాల్సి ఉంది. ఏటా బడులు తెరిచిన మొదటిరోజే పుస్తకాలు అందిస్తామని చెబుతున్నప్పటికీ కొన్ని పాఠశాలల్లో మాత్రమే అమలు జరుగుతుంది. చాలా పాఠశాలల్లో పూర్తిస్థాయిలో చేరుకోవడం లేదు. అయితే చేరుకున్న పాఠ్యపుస్తకాల్లో సైతం ఇంకా కొన్ని మాధ్యమాలకు సంబంధించి రావాల్సి ఉంది. అన్ని తరగతుల పాఠ్య పుస్తకాలు పూర్తిస్థాయిలో చేరితేనే విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుంది. తరగతిలో కొంత మంది విద్యార్థులకు కొన్ని పుస్తకాలు, మరికొన్ని విద్యార్థులకు మరి కొన్ని ఇచ్చి ఇదివరకు సర్దుబాటు చేసేవారు. ఈ సారైనా విద్యార్థులకు పూర్తిస్థాయిలో పుస్తకాలు పంపిణీ చేస్తారో.. లేదో చూడాల్సిందే.

ఆస్పత్రుల తనిఖీ బృందం ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్‌..

ఆదిలాబాద్‌టౌన్‌: ప్రైవేట్‌ నర్సింగ్‌ హోమ్‌లను తనిఖీ చేసేందుకు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. 'ప్రైవేట్‌.. దోపిడీ' శీర్షికన 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి స్పందించారు. డీఎంహెచ్‌వో సమావేశ మందిరంలో వైద్యాధికారులతో సమావేశం నిర్వహించి నలుగురు సభ్యుల గల బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధనతో పాటు మాస్‌ మీడియా అధికారి, మరో ఇద్దరు వైద్య సిబ్బందితో ఆస్పత్రులను తనిఖీ చేస్తారని పేర్కొన్నారు. వారానికి రెండు ఆస్పత్రులను తప్పనిసరిగా తనిఖీ చేయాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు.



'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనం

24 నుంచి ఇంటర్‌ సప్లిమెంటరీ పరీక్షలు

- ఉదయం ప్రథమ, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు

ఆదిలాబాద్‌టౌన్‌: ఇంటర్‌ అడ్వాన్స్‌డ్‌ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ఇంటర్మీడియెట్‌ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఐఈవో రవీందర్‌ కుమార్‌ తెలిపారు. జిల్లాలో 14 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 3,240 పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఇందులో జనరల్‌ విద్యార్థులు 3,293 మంది, ఒకేషనల్‌ 127 మంది ఉన్నారు. అలాగే ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2,451మంది హాజరుకానున్నారు. ఇందులో జనరల్‌ విద్యార్థులు 2,229 మంది, ఒకేషనల్‌ విద్యార్థులు 222 మంది ఉన్నారు. పరీక్షల నిర్వహణ కోసం 14 మంది సీఎస్‌, 14 మంది డీవోలు, ఒక ఫ్లయింగ్‌, ఒక సిట్టింగ్‌ స్క్వాడ్‌ను నియమించినట్లు వివరించారు. ప్రశ్నపత్రాల కోసం ఏడు స్టోరేజ్‌ పాయింట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంగళవారం ఆర్‌ఐవో కార్యాలయంలో సీఎస్‌, డీవోల సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

దుకాణంలో చోరీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఓల్డ్ బస్టాండ్ ఏరియాలో గల ఓ దుకాణంలో చోరీ జరిగింది. సోమవారం ఉదయం షాపు తెరిచేందుకు వచ్చిన యజమాని షెటర్ తాళాలు పగల గొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు దుకాణాన్ని తెరిచి దర్యాప్తు చేపట్టారు. చుట్టుపక్కల గల సీసీ కెమెరాలను పరిశీలించారు.

అంతర్జాతీయ సమ్మేళనానికి జిల్లావాసి


బి.వెంకట్

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ పద్యకవి బి.వెంకట్‌కు ఈ నెల 26న అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరులో జరిగే సమ్మేళనానికి ఆహ్వానం అందింది. శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డా.కత్తిమండ ప్రతాప్ ఆహ్వానపత్రిక పంపించారు. అంతర్జాతీయ స్థాయిలో 176 మంది కవులు ఒక్కొక్కరు మూడు స్వీయ సీసపద్యములను రచించగా వారిలో వెంకట్ పంపించిన పద్యం 'సీసపద్యవైభవము' అనేపుస్తకములో ముద్రితమైంది. వీటిని వెంకట్ అక్కడి పద్య సమ్మేళనములో పద్యగానం చేయనున్నారు. ఈ సందర్భంగా జిల్లా కవులు, కళాకారులు ఆయనకు అభినందనలు తెలిపారు.

అప్పులబాధతో ఒకరు ఆత్మహత్య

ముధోల్: అప్పులబాధతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన కోట్ల మాధవ్‌రావు (35) కొన్ని రోజుల క్రితం దోబిగల్లీలో ఇళ్లు నిర్మించుకున్నాడు. ఇంటికోసం చేసిన అప్పులు తీర్చేమార్గం కనిపించకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పంచాయతీ కార్యాలయంలో చోరీ

ఖానాపూర్: మండలంలోని ఎర్వచింతల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో చోరీ జరిగినట్లు పంచాయతీ కార్యదర్శి మేస హన్మంతు తెలిపారు. పంచాయతీ భవనంలోని గదులలో గల సోలార్ లైటింగ్ వస్తువులతో పాటు క్రికెట్ కిట్, వాలీబాల్స్, నెట్, టీషర్ట్‌లు, డంబెల్స్ ఇతర సామగ్రి ఎత్తుకెళ్లారని ఆయన పేర్కొన్నారు. గతంలో సుమారు వంద బతుకమ్మ చీరలతో పాటు రూ.4 వేల విలువైన పైప్ బెండల్స్ సైతం ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈ విషయమై సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

దాడికి పాల్పడిన వారిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన అజీమ్, గణేశ్‌పై కిట్టు, మల్లేశ్‌తో పాటు మరో ఐదుగురు దాడికి పాల్పడినట్లు టూటౌన్ ఎస్సై లాల్‌సింగ్ నాయక్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్న సమయంలో బస్టాండ్ వైపు నుంచి అజీమ్, గణేశ్ వస్తుండగా అదే ప్రాంతంలో ఉన్న కిట్టు వారిని తాకాడు. ఎందుకిలా చేశావని ప్రశ్నించగా కిట్టు, మల్లేశ్‌తో పాటు అతని స్నేహితులు ఐదుగురు దాడికి దిగారు. దీంతో అజీమ్ తలకు గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పచ్చడి మెతుకులూ పిరమే..!

పచ్చడి మెతుకులు తిని కడుపు నింపుకునే పేద, మధ్యతరగతి ప్రజలకు పెరిగిన ధరలతో అవికూడా భారంగానే మారాయి. ఈ ఏడాది మామిడికాయ పచ్చడి పేదోడి కంచంలోకి రానంటోంది. మామిడి కాయల దిగుబడి గణనీయంగా తగ్గడంతో పాటు నూనె, కారం ధరలు కూడా ఆకాశాన్ని అంటుతుండడంతో సామాన్యులు పచ్చడిపై ఆశలు వదిలేశారు.

- జిల్లాలో పెరిగిన పచ్చడి మామిడికాయ ధరలు
- ఈదురు గాలులు, అకాల వర్షాలతో మామిడి కొరత
- ఉన్న కాయల ధరలు పెంచిన రైతులు, వ్యాపారులు
- పేద, మధ్య తరగతి ప్రజలు పచ్చడి కూడా పెట్టుకోలేని పరిస్థితి


మామిడికాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

నిర్మల్‌ఖిల్లా: మామిడి పచ్చడి అనగానే ప్రతి ఒక్కరికీ నోట్లో నీళ్లూరుతాయి. మామిడి ఊరగాయ అంటే అందరికీ సుపరిచితమే. గుడిసెలో ఉండే పేదవాడి నుంచి మేడలో ఉండే ధనికుడి వరకు అందరూ ఇష్టంగా తినేది ఆవకాయ పచ్చడి. అయితే ఆవకాయ పచ్చడి పెట్టుకునేందుకు ఇదే సరైన తరుణం. వేసవిలో ప్రతీ ఇంట్లో ఊరగాయ తయారు చేసుకుని నిల్వ ఉంచుకునే సంప్రదాయం కొనసాగుతోంది. ఒకసారి తయారు చేసుకున్న పచ్చడి ఏడాదిపాటు తినడానికి సిద్ధంగా ఉంటుంది. అయితే ప్రస్తుతం మార్కెట్లో పచ్చడి మామిడికాయల ధరలు అందనంత దూరంలో ఉన్నాయి. గతంలో కంటే ఈ ఏడాది మామిడికాయల ధరలు మూడింతలు పెరిగినట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు.

కాయల ధరల పెరుగుదల ఇలా..

ఏటా వేసవిలో వచ్చే పచ్చడి మామిడికాయలు కిలో రూ.40 నుంచి రూ.60 వరకు ధర పలికేవి. అయితే ఈఏడాది ఏకంగా రూ.100 నుంచి రూ.140 వరకు ధర పలుకుతున్నాయి. దీనికి తోడు పచ్చడి తయారీకి అవసరమయ్యే వేరుశనగ నూనె, ఎండుమిర్చి కారం, మసాలా దినుసులు, వెల్లుల్లి ధరలు కూడా పెరిగాయి. దీంతో మామిడి పచ్చడి తయారు చేసుకోవడానికి ఖర్చు ఎక్కువ అవుతుందని చెబుతున్నారు.

పచ్చడి కాయలకు డిమాండ్

సర్వ సాధారణంగా ప్రతీ వేసవికాలంలో ఏప్రిల్, మే నెలల్లో మామిడికాయలతో నిలువ పచ్చళ్ళు తయారు చేసుకుంటారు. ఈ తంతు ప్రతీ ఇంట్లో కొనసాగుతోంది. పచ్చళ్ళ తయారీకి ప్రధానంగా చిన్నరసం, నాటు రసం, తెల్ల గులాబీ వంటి మామిడిరకాలను వినియోగిస్తారు. ప్రస్తుతం మార్కెట్లో తెల్ల గులాబీ, నాటు రసం, చిన్న మల్లికలు వంటి రకాలు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో మామిడికాయల ఉత్పత్తి మధ్యస్థంగా ఉన్నప్పటికీ ఈ ఏడు వాతావరణ పరిస్థితులు కూడా అనుకూలించకపోవడంతో దిగుబడి తక్కువగా ఉంది. దీనికి తోడు ఇటీవల అకాల వర్షాలు, ఈదురు గాలులతో కోతకు వచ్చిన కాయలన్నీ రాలిపోవడంతో నష్టం వాటిల్లింది. దీంతో ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిరావడంతో పచ్చడి మామిడి కాయలకు జిల్లాలో డిమాండ్ ఎక్కువగా ఉంది.

ధరలు బాగా పెరిగాయి



ఈఏడాది పచ్చడి మామిడికాయల ధరలు మూడింతలయ్యాయి. వీటికి తోడు నూనె, పొడి కారం, వెల్లుల్లి ధరలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. దీంతో మాలాంటి సామాన్యులకు పచ్చడి తయారీ భారంగా మారింది.

– బి.లక్ష్మి, గృహిణి, చించోలి(బి), సారంగపూర్

మాలధారణకు వెళ్తూ మరలిరాని లోకాలకు..

- గోదావరిలో మునిగి విద్యార్థి మృతి


కీర్తన్‌గౌడ్ మృతదేహం

దండేపల్లి: హనుమాన్ మాలధారణ కోసం వెళ్తూ గోదావరి నదిలో స్నానం చేస్తూ విద్యార్థి నీటమునిగి మృతి చెందిన సంఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెం గోదావరి నది వద్ద చోటు చేసుకుంది. ఎస్సై భూమేష్ తెలిపిన వివరాల ప్రకారం. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బద్దిపల్లికి చెందిన ఇంటర్ విద్యార్థి దుర్గం కీర్తన్‌గౌడ్ అలియాస్ రిషి (19) హనుమాన్ మాలాధారణ కోసం స్నేహితులతో కలిసి సోమవారం దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయానికి బయల్దేరాడు. గూడెం గోదావరి వంతెన సమీపంలో స్నానం చేసేందుకు నదిలో దిగారు. కీర్తన్‌కు ఈత రాకపోవడంతో స్నేహితుల కళ్లముందే నీటిలో మునిగి చనిపోయాడు. పోలీసులకు సమాచారం అందించడంతో గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కాపలా ఉండి ప్రాణాలు కాపాడారు..

- తెగిపడిన విద్యుత్ తీగలు
- సకాలంలో స్పందించని సబ్‌స్టేషన్ ఆపరేటర్


తెగిపడిన విద్యుత్ వైర్ల వద్ద కాపలా ఉన్న గ్రామస్తులు

వేమనపల్లి: తెల్లవారుతోంది.. చిమ్మచీకటి తొలగనే లేదు.. మండల కేంద్రంలో తునికాకు సేకరణ కోసం వెళ్లే ప్రజలు పరుగులు తీస్తున్నారు.. రైతులు వరి కల్లాల వైపు.. పశువులు మేత కోసం పొలాల వైపు వెళ్తున్నాయి. అంతలోనే ప్రధాన రహదారిపై విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. మంటలు లేస్తుండటంతో రోడ్డుపై వెళ్తున్న ఏమ కిష్టయ్య, కంపెల సత్యం, మధునయ్య గమనించారు. గతంలో ఇదే ప్రదేశంలో విద్యుత్ తీగలు తెగిపడి గొండె రాజన్న, గేదె అక్కడికక్కడే మృతి చెందారు. అదే ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకొని రోడ్డుపై నిలబడి ప్రజలను అప్రమత్తం చేశారు. పశువులను దారిమళ్లించారు. విద్యుత్ సరఫరా నిలిపివేయాలని నీల్వాయి సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయకపోవడంతో జేఎల్ఎం ఉదయ్‌కుమార్, ట్రాన్స్‌కో ఏఈ దీక్షిత్‌లకు ఫోన్ చేసి ప్రమాద పరిస్థితిని వివరించారు. వారి జోక్యంతో సరఫరా నిలిపివేయగా పెను ప్రమాదం తప్పింది.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఆసిఫాబాద్‌అర్బన్: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై రాజేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని ఆళ్లపల్లికి చెందిన ముద్రకల్ శ్రీనివాస్ (32) ఐదేళ్లుగా జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్‌లో నివాసం ఉంటూ మేస్త్రీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఆది వారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్య, పిల్లలతో గొడవపడ్డాడు. వారిని ఇంటిబయటే ఉంచి తలుపులు వేసుకున్నాడు. ఎంతకూ తీయకపోవడంతో బయటే పడుకున్నారు. ఉదయం లేచిన తర్వాత కూడా తలుపులు తీయకపోవడంతో వెంటిలేటర్ నుంచి లోనికిచూడగా ఉరేసుకుని కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతునికి భార్య సమ్మక్క, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని సోదరుడు నగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మార్కెట్‌కు పోటెత్తిన జొన్నలు


బారులు తీరిన వాహనాలు

బోథ్: బోథ్ మార్కెట్‌కు సోమవారం జొన్న పంట పోటెత్తడంతో వాహనాలు బారులు తీరాయి. నాలుగు రోజులు క్రితం పంటను తీసుకురావద్దని, ఈ నెల 20వ తేదీన పంటను తీసుకురావాలని మార్క్‌ఫెడ్ అధికారులు చెప్పడంతో సోమవారం బోథ్ మార్కెట్ పరిధిలోని రైతులు జొన్న పంటను మార్కెట్‌కు తీసుకువచ్చారు. అయితే ఆదివారం రాత్రి సమయంలో ఈ నెల వరకు కొనుగోళ్లను బంద్ చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ సమాచారం రైతులకు చేరకపోవడంతో భారీగా పంటను మార్కెట్‌కు తీసుకుని వచ్చారు. అధికారులు పంటను కొనుగోలు చేయమని చెప్పడంతో కొంత వాగ్వాదం జరిగింది. దీంతో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మార్కెట్ అధికారులు కల్పించుకుని వచ్చిన వాహనాలను లోనికి అనుమతించారు. కాగా రైతులు 24వ తేదీ వరకు జొన్న పంటను మార్కెట్‌కు తీసుకురావద్దని వారు కోరారు.

లారీ బోల్తా పడి ఒకరికి గాయాలు


వంతెనపై నుంచి బోల్తాపడిన లారీ

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ వద్ద వంతెనపై నుంచి లారీ బోల్తాపడి ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం తెల్లవారుజామున మంచిర్యాల జిల్లా దేవాపూర్ నుంచి భైంసాకు సిమెంట్ లోడ్‌తో వస్తున్న లారీ అదుపుతప్పి వంతెన పైనుంచి కిందపడిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ లవకుశ్‌సరోజ్‌కు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం 108లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థి అదృశ్యం


నారాయణ(ఫైల్)

ఇంద్రవెల్లి: మండలంలోని హర్కపూర్ గ్రామానికి చెందిన డాకురే నారాయణ అనే డిగ్రీ విద్యార్థి అదృశ్యమైనట్లు ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు. ఈ నెల 17న పరీక్ష రాయడానికి ఉట్నూర్‌కు వెళ్లిన నారాయణ ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన చోట వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం విద్యార్థి తండ్రి డాకురే మారుతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- వాగులో నీటమునిగి విద్యార్థి మృతి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని లాండసాంగ్వి సమీపంలో గల సాత్నాల వాగులో సరదాగా ఈత కోసం వెళ్లి ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన మహ్మద్ అయాన్ (15) విద్యార్థి మృతి చెందాడు. ఆదిలాబాద్‌రూరల్ ఏఎస్సై సునీత కథనం ప్రకారం.. పట్టణంలోని కేఆర్‌కే కాలనీ చెందిన అయాన్ ఇటీవలే పదో తరగతి పూర్తి చేశాడు. స్నేహితులతో కలిసి సోమవారం సరదాగా ఈతకోసం వాగుకు వెళ్లాడు. ఈత రాకపోవడంతో నీటిలో గల్లంతై మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై వివరించారు.

ఇంటిపైనుంచి పడి వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

లక్ష్మణచాంద: ప్రమాదవశాత్తు ఇంటిపై నుంచి కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని మునిపెల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం బీహార్ నుంచి వలస వచ్చిన లాల సహాని సంజీవన్ (28) గ్రామంలో హమాలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి గ్రామంలోని ఆదర్శ భవనం పైన పడుకున్న సంజీవన్ అర్ధరాత్రి బాత్రూంకు వెళ్లేందుకు కిందకు దిగుతుండగా కాలుజారి కిందపడడంతో తీవ్రగాయాలై మృతి చెందాడు. మృతదేహానికి నిర్మల్ ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి గ్రామస్తుల సాయంతో బీహార్‌కు పంపించారు. సోమవారం మృతుడి సోదరుడు వకీల్ సహాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి

- మరొకరికి గాయాలు

భైంసాటౌన్: పట్టణ శివారులోని హరియాలి పెట్రోల్ పంప్ వద్ద సోమవారం సాయంత్రం వేర్వేరుగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఒకరికి తీవ్రంగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. కుభీర్ మండలం పల్సి గ్రామానికి చెందిన కొండ సాగర్‌గౌడ్ (43) నిజామాబాద్ నుంచి భైంసా వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా హరియాలి పెట్రోల్ పంప్ సమీపంలో టాటాఏస్ వాహనాన్ని వెనకనుంచి ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారకస్థితిలో పడి ఉండగా గమనించిన స్థానికులు పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు నిజామాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇలేగాం గ్రామానికి చెందిన లక్ష్మణ్ ద్విచక్ర వాహనంపై భైంసాకు వస్తుండగా గుర్తు తెలియని మరో వాహనం ఢీకొని గాయాలపాలయ్యాడు. 108లో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

విద్యుత్‌షాక్‌తో ఒకరికి గాయాలు


క్షతగాత్రున్ని తరలిస్తున్న స్థానికులు

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్‌లో విద్యుత్ షాక్‌తో ఒకరికి గాయాలయ్యాయి. ఖానాపూర్–పెంబి, నిర్మల్–కడెం విద్యుత్‌లైన్ ప్రాంతంలో భాగంగా తర్లపాడ్‌లోని ఓంకారేశ్వర ఆలయం వద్ద విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో కాగజ్‌నగర్‌కు చెందిన కూలీ స్వామి షాక్‌కు గురయ్యాడు. స్థానికులు వెంటనే ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం నిర్మల్‌కు తరలించారు. ఈ విషయమై ఏఈ యశ్వంత్‌ని ఫోన్‌లో వివరణ కోరగా తాను అందుబాటులో లేనని, తనకు ఎలాంటి సమాచారం తెలియదన్నారు.

చికిత్స పొందుతూ వ్యాపారి మృతి


శ్రీనివాస్(ఫైల్)

భీమారం: ఈ నెల 18న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన మండల కేంద్రంలోని బీసీకాలనీకి చెందిన వ్యాపారి కొమ్ము శ్రీనివాస్ (48) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో కొన్నేళ్ల నుంచి కిరాణ షాపు నిర్వహిస్తున్న శ్రీనివాస్ వ్యాపారంలో నష్టాలు రావడంతో మనస్తాపం చెందాడు. ఈనెల 18న ఇంటినుంచి బయటకు వెళ్లి పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతునికి భార్య విజయలక్ష్మి, కుమారుడు అభిరామ్ ఉన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బెల్లంపల్లి: బెల్లంపల్లి–మందమర్రి రైల్వే స్టేషన్‌ల మధ్య రైలు పట్టాలపై సోమవారం మధ్యాహ్నం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబల్ కె.సురేష్‌గౌడ్ తెలిపారు. మృతునికి 45 నుంచి 50 ఏళ్లు ఉంటాయని, ఏదో గుర్తు తెలియని రైలులో నుంచి కిందపడిపోయి మృతిచెంది ఉంటాడన్నారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, నల్లని సన్నగీతలు కలిగిన తెల్లరంగు ఫుల్ షర్ట్, నల్లరంగు కాటన్ జీన్స్‌ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని బెల్లంపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ గదిలో భద్రపరిచామన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు 8712658596 నంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

యువకుడి దారుణ హత్య


చంద్రశేఖర్ (ఫైల్)

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన గుర్లె చంద్రశేఖర్ (28) సోమవారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామంలో మద్యం మత్తులో నలుగురు యువకుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో చంద్రశేఖర్‌ను మిగతా యువకులు బండ రాయితో మోదడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకార్ పరిశీలించి హత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

తునికాకు కూలీకి గాయాలు


చికిత్స పొందుతున్న మధునక్క

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం చారిగాం గ్రామానికి చెందిన మధునక్క సోమవారం కాగజ్‌నగర్ అటవీ ప్రాంతంలో తునికాకు సేకరణకు వెళ్లింది. చెట్టెక్కి తునికాకు తెంపుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

వైద్య ఖర్చులు ఇవ్వాలి

గాయపడిన కూలీకి అటవీశాఖ అధికారులు వైద్య ఖర్చులు చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బాధితురాలిని ఆయన పరామర్శించారు.

ఉపాధి హామీ కూలీకి అస్వస్థత

- స్పృహతప్పి పడిపోవడంతో విరిగిన చేయి


అస్వస్థతకు గురైన గంగమ్మ

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామానికి చెందిన ఉపాధిహామీ కూలీ కడదరపు గంగమ్మ అస్వస్థతకు గురైంది. పనిస్థలంలో స్పృహతప్పి పడిపోవడంతో కుడిచేయి విరిగింది. తోటి కూలీలు గంగమ్మను చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతోనే స్పృహతప్పి పడిపోయిందని తోటి కూలీలు తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి


అరవింద్ (ఫైల్)

బోథ్: ఈ నెల 6న అదృశ్యమైన మండలంలోని కుచులాపూర్ గ్రామానికి చెందిన బి.అరవింద్(28)సోమవారం శవమై కనిపించాడు. ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం ..గ్రామానికి చెందిన అరవింద్ ఈ నెల 6న ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగిరాకపోవడంతో అతని తండ్రి లక్ష్మణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం గ్రామ సమీపంలోని ఓ చేనులో యజమాని జొన్న పంటకు చెందిన తుక్కును ఏరుతుండగా వాసన రావడంతో వెళ్లి చూడగా మృతదేహం కనిపించింది. వెంటనే గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించాడు. సీఐ రమేశ్, ఎస్సై రాము సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించగా కుక్కలు పీక్కుతిన్న ఆనవాళ్లు కనిపించాయి. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆస్పత్రికి సుస్తీ


ఆస్పత్రిలో క్యూలో ఉన్న గర్భిణుల నెత్తిపై ప్రమాదకరంగా పెచ్చులూడి కనిపిస్తున్న ఆస్పత్రి పైకప్పు

నిర్మల్ జిల్లా కేంద్రంలోని మాతాశిషు ఆస్పత్రికి సుస్తీ చేసింది. చికిత్స కోసం వచ్చే తల్లీ, బిడ్డలకే కొత్త జబ్బులు అంటుకునేలా అపరిశుభ్రంగా తయారైంది. శానిటేషన్ సిబ్బంది లేకపోవడంతో ఆస్పత్రిలో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. గోడలు, మూలల వద్ద ఉమ్మివేస్తుండడంతో కంపు కొడుతోంది. ఇక ఆస్పత్రిలో పరీక్షల కోసం వచ్చే గర్భిణులు చెకప్ కోసం నలబడే చోట పైకప్పు పెచ్చులు ఎప్పుడు ఊడిపడతాయో తెలియని పరిస్థితి. ఇక ఆస్పత్రిలో అడ్మిట్ అయిన తల్లులు, వారి అంటెండర్లకు తాగునీరు దొరకడంలేదు. దీంతో ఆస్పత్రి బయటి నుంచి బాటిళ్లలో తాగునీరు తెచ్చుకుంటున్నారు. గర్భిణులు, తల్లులు, పిల్లలు ఇబ్బంది పడుతున్నా అధికారుల పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్


ట్యాంక్‌లో తాగునీరు లేకపోవడంతో ఏంచేయాలో తెలియక తన పిల్లలతో తండ్రి


ఆస్పత్రి బయట ఉన్న చేతిపంపు నుండి వాటర్ బాటిల్ నీటిని నింపుకుంటున్న యువకుడు